

ఉధృతంగా గోదావరి 7
అతి వేగం.. తీసింది ఇద్దరి ప్రాణం!
» ఆటోను ఢీకొన్న కారు.. కోరింగలో ఘటన 7
గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్టు
» మూడు కిలోల గంజాయి సీజ్ 7

రెడ్ అలర్ట్



అంబాజీపేటలో జోరుగా కురుస్తున్న వర్షం

జిల్లావ్యాప్తంగా భారీవర్షం

» ఒకవైపు భారీవర్షాలు.. మరో రెండు, మూడురోజులు ఇదే పరిస్థితి
» అల్పపీడనం ప్రభావంతో ఆదివారం రోజంతా భారీవర్షం
» వాయుగుండంగా మారనున్న అల్పపీడనం
» దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర మధ్య రేపు తీరం దాటే అవకాశం
» ఆ ప్రభావంతో రాష్ట్రంలో కొనసాగనున్న భారీవర్షాలు
» డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలకు రెడ్ అలర్ట్
» తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
» అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు
» లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచన
» మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ
» ఇప్పటికే వర్షాలకు మునిగిన పంటలు.. ఆందోళనలో రైతులు

రెడ్ అలర్ట్.. ఒకవైపు వర్షాలు కురుస్తున్నాయి.. మరో రెండు, మూడురోజులపాటు కురవనున్నాయి. దక్షిణ ఒడిశాతోపాటు ఉత్తరాంధ్ర తీర ప్రాంతంలో కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా మారే ప్రమాదముందని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇది ఈనెల 19 తీరం దాటవచ్చని, ఈ ప్రభావంతో రాష్ట్రంలో భారీవర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు రెడ్ అలర్ట్.. తూర్పుగోదావరి, అల్లూరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం జిల్లాలో ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రజాజీవనం స్తంభించింది. వ్యాపారసంస్థలు మూతబడ్డాయి. భారీవర్షంతో జిల్లావ్యాప్తంగా వరిపొలాలు నీట మునిగి అన్నదాతలకు ఇబ్బందులు మొదలయ్యాయి. దీనికితోడు పలుచోట్ల ప్రధానమైన డ్రైన్లతోపాటు మైనరు డ్రైన్లు వర్షపునీటితో నిండి పొంగి ప్రవహించడంవల్ల పంటపొలాల్లో వర్షపునీరు దిగే మార్గం లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

కంట్రోల్ రూముల ద్వారా సమీక్ష

రెండురోజులపాటు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరిక జారీ చేయడంతోపాటు కలెక్టరేట్ సహా ఆర్డీవోలు, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీనికితోడు గోదావరిలో కూడా వరద నీటి మట్టం పెరుగుతోంది. లంక ప్రాంతాల్లోకి వరద ప్రవాహం చొచ్చుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆదివారం నాటి వర్ష ప్రభావంవల్ల జిల్లావ్యాప్తంగా అధికారులు ఆయా ప్రాంతాల్లోని పరిస్థితులపై సమీక్షించారు. కొన్నిచోట్ల తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అప్రమత్తమయ్యారు. ఇరిగేషన్, డ్రైన్స్, రెవెన్యూ సహా ప్రభుత్వశాఖల ఉద్యోగులు వర్ష ప్రభావ ప్రాంతాల్లో పర్యటించారు.

వర్షాలతో జిల్లావ్యాప్తంగా పంట పొలాలు మునగడంతో ఇబ్బందులను పరిశీలించి చేలల్లో ఉన్న ముంపును బయటికి పంపించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే పనిలో నిమగ్నమయ్యారు. కోనసీమలోని కొన్ని మండలాల్లో పంటచేలు మరోసారి ముంపునకు గురికావడంవల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ ప్రారంభ దశలోనే పంట పొలాల ముంపుతో తీవ్రమైన నష్టాలను కలగజేస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో గౌతమీ, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో వరద ప్రవాహం పెరుగుతోంది. మహారాష్ట్రలో భారీవర్షాలవల్ల గోదావరినదికి వరదలు తీవ్రస్థాయిలో పోటెత్తుతాయని జలవనరులశాఖ నిపుణుల అంచనాలతో ప్రజలు, అధికారులు అప్రమత్తమవుతున్నారు.

మరో అల్పపీడనం

బంగాళాఖాతంలో ఈనెల 18, 23 తేదీల్లో అల్పపీడనాలు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ చేసిన హెచ్చరికలతో కోస్తా ఆంధ్ర పరిధిలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్నిచోట్ల భారీనుంచి అతిభారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో ఈనెల 18, 19 తేదీల్లో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా మత్స్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.



కాట్రేనికోన మండలంలో నీటమునిగిన పొలాలు

జిల్లాలో 11.6 సెంటీమీటర్ల సగటున వర్షపాతం నమోదు

అమలాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో 256.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 11.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా ఐ.పోలవరంలో 20.4 సెం.మీ., సఖినేటిపల్లిలో అత్యల్పంగా 5.4సెం.మీ వర్షపాతంనమోదైంది. ఆత్రేయపురంలో 20 సెం.మీ., మండపేట 10, రాయవరం 14.6, రామచంద్రపురం 6.8, ఆలమూరు 11.2, రావులపాలెం 15.2, కొత్తపేట 9.2, కపిలేశ్వరపురం 11.6, కె.గంగవరం 7.2, ఐ.పోలవరం 20.4, ముమ్మిడివరం 18.2, అయినవిల్లి 10.4. పి.గన్నవరం 8.6, అంబాజీపేట 9.2, మామిడికుదురు 8.4, రాజోలు 8.8,మలికిపురం 6, అల్లవరం 9.6,అమలాపురం 10.2, ఉప్పలగుప్తం 18.8, కాట్రేని కోనలో 16.4 సెం.మీ.వర్షపాతం నమోదైంది.

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదు: మత్స్యశాఖ అభివృద్ధి అధికారి

రాజోలు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మూడురోజులపాటు భారీనుంచి అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచనలమేరకు కలెక్టర్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆదేశాలతో ఈనెల 20 వరకు సముద్రంలోకి వేటకు వెళ్లే మత్స్యకారులు వెళ్లరాదని రాజోలు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ గోపాలకృష్ణ కోరారు. ఈ సందర్భంగా రాజోలులో ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ మత్స్యకారులు బోట్లు, వలలను, ఇంజన్లను సురక్షితమైన ప్రదేశాల్లో జాగ్రత్తగా భద్రపరచుకోవాలన్నారు. భారీ వర్షాలకు చేప, రొయ్య రైతులందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీవర్షాలకు చెరువులు నిండి గట్టు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్తగా అడుగు లోపు నీటిని బయటకు మళ్లించాలన్నారు. బలహీనంగా ఉన్న గట్లను పటిష్టం చేసుకోవాలన్నారు. ఎడతెరిపిలేని వర్షాలకు సూర్యరశ్మి లేకపోవడంవల్ల చెరువుల్లో ఉండే ఆక్సిజన్ స్థాయి తగ్గే ప్రమాదం ఉందన్నారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడవచ్చునని, జనరేటర్లు, డీజిల్ ఇంజన్లు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.

వెంకన్న భక్తులకు స్త్రీశక్తి పథకం అమలు

» ఐదు రకాల బస్సుల్లో ప్రయాణం ఉచితం
» ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

ఆత్రేయపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు స్త్రీ శక్తి పథకం ద్వారా ప్రవేశపెట్టిన ఐదు రకాల బస్సు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చునని ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. 'వాడపల్లి స్పెషల్‌కు నోఫ్రీ' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది.శనివారం వివిధ డిపోలనుంచి వాడపల్లికి ఆర్టీసీ బస్సుల్లో చేరుకున్న మహిళా ప్రయాణికులకు స్పెషల్ బస్సులు కావడంతో స్త్రీశక్తి పథకం వర్తించదని బస్సులపై నేమ్‌బోర్డులు పెట్టారు. దీనిపై మహిళా భక్తులు నిరాశకు లోనుకావడంపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనికి ఆర్టీసీ ఎండీ తిరుమలరావు స్పందించి వాడపల్లి ఆలయానికి వెళ్లే ఐదు రకాల బస్సు సర్వీసుల ద్వారా ఉచితబస్సు ప్రయాణం అందించాలని ఆదేశించారని రావులపాలెం డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ వెల్లడించారు.

రెండోరోజూ అనూహ్య స్పందన

» ఆర్టీసీ బస్సుల్లో 37,138మంది మహిళలకు ఉచిత ప్రయాణం
» రెండోరోజు రూ.12,61,810 భారం

అమలాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళల ఉచిత బస్సు సర్వీసుకు జిల్లాలో మహిళలనుంచి అనూహ్య స్పందన లభించింది. రెండోరోజైన శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం అర్ధరాత్రి వరకు 37వేలమంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు సర్వీసును ఉపయోగించుకున్నారు. దీనిద్వారా ప్రభుత్వంపై రూ.12.61లక్షల భారం పండింది. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఆర్టీసీలో నడుపుతున్న పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది.

మరింత పెరగొచ్చు

జిల్లాలో మహిళలకు ఉచితబస్సు ప్రయాణాలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా పరిధిలోని నాలుగు ఆర్టీసీ డిపోల పరిధిలో 37,138 మంది మహిళల ప్రయాణం ద్వారా సంస్థపై రూ.12,61,810 భారం పడింది. రెండోరోజునే స్పందన అపూర్వం కావడంతో ఆర్టీసీ అధికారులు సోమవారం నుంచి ఈ సంఖ్య మరింత పెరుగుతుందనే అంచనాలు వేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో అత్యధికంగా రావులపాలెం డిపో నుంచి 12,202మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. రామచంద్రపురం డిపోనుంచి 10,858 మంది, అమలాపురంనుంచి 8,853మంది, రాజోలునుంచి 5,225మంది మహిళలు ప్రయాణించినట్టు ప్రజారవాణాశాఖ అధికారి తెలిపారు. మొత్తం మీద మహిళల ఉచిత బస్సు సర్వీసుకు జిల్లావ్యాప్తంగా రెండోరోజు స్పందన అపూర్వం కావడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.



రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సువద్ద మహిళల రద్దీ

పన్నులేనివి.. 1836



పిఠాపురం వ్యూ

ఏ జిల్లాలో నిర్మాణాలెన్ని

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా 1836 భవనాలకు అసలే పన్నులు విధించలేదని గుర్తించారు. అత్యధికంగా కాకినాడలో 365 నిర్మాణాలు ఉండగా రూ.1.33 కోట్లు ఆదాయాన్ని కార్పొరేషన్ కోల్పోతోంది.పిఠాపురంలో 67 నిర్మాణాలకు రూ.3.65 లక్షలు, పెద్దాపురంలో 148కి రూ.6.72 లక్షలు, గొల్లప్రోలులో 24కి రూ.71 వేలు, సామర్లకోటలో 85కి 1.71లక్షలు, తునిలో 33కి రూ.1.59 లక్షలు, ఏలేశ్వరంలో 51 నిర్మాణాలకు పన్నులు వేయకపోవడంతో 1.55 లక్షల ఆదాయానికి గండిపడింది.
- తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో 457 భవనాలు, నిర్మాణాలకు పన్నులు విధించకపోవడంవల్ల 59.49 లక్షలు, కొవ్వూరులో 70కి రూ.1.74 లక్షలు, నిడదవోలులో 213కి రూ.6.42 లక్షలు ఆదాయాన్ని పుర సంస్థలు కోల్పోయాయి.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మునిసిపాలిటీ పరిధిలో 99 నిర్మాణాలకు పన్నులు వేయకపోవడం వల్ల రూ.6.39 లక్షలు, మండపేటలో 112 నిర్మాణాలకు రూ.6.14 లక్ష లు, రామచంద్రపురంలో 52కి రూ.2.47లక్షలు, ముమ్మిడివరంలో 60 నిర్మాణాలకు పన్నులు వేయకపోవడం వల్ల రూ.1.30 లక్షల ఆదాయానికి గండిపడింది. ఇవి సర్వేలో వెలుగుచూసినవి మాత్రమే. వాస్తవంలో పిఠాపురంలో పన్నులు విధించని నిర్మాణాలు వెయ్యి వరకూ ఉండే అవకాశం ఉంది. కాకినాడ కార్పొరేషన్‌తో పాటు మిగిలిన పట్టణాల్లోనూ అదే పరిస్థితి ఉంది.

పైసలిచ్చుకో.. పనికానిచ్చుకో.. ఇది ఎక్కడైనా పురపాలక సంఘాల సిబ్బంది తీరు.. మాకు పన్ను తగ్గాలండి బాబు అని మునిసిపల్ సిబ్బంది దగ్గరకు వెళితే అదెంత పని అంటారు.. మూమూళ్లు ఇస్తే చేసి పెట్టేస్తారు.. ఇలా పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్లల్లో ఆస్తి, కుళాయి పన్నుల విధింపు ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉంది. ఒక నిర్దిష్ట విధానం లేకపోవడం, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఆదాయానికి భారీగా గండి పడుతోంది. పట్టణాలు, నగరాల్లో వార్డు సచివాలయ సిబ్బంది, మునిసిపల్ అధికారులు, సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి జీపీఎస్ ఆధారంగా సర్వే నిర్వహిస్తే మరిన్ని లోపాలు వెలుగుచేసే అవకాశం ఉందని విశ్రాంత మునిసిపల్ అధికారులు చెబుతున్నారు.

పుర ఆదాయానికి భారీగా తూట్లు

» పైసలిచ్చుకో.. పన్ను తగ్గించుకో
» ఇంకనూ మారని పుర సిబ్బంది తీరు
» పన్నులు తగ్గించేసి.. అడ్డగోలుగా వేసేసి
» ఇష్టానుసారంగా భవనాల పన్నులు
» నగరాలు, పట్టణాల సర్వేలో వెల్లడి
» ఇది అధికారికంగా బయటపడిన లెక్క
» వాస్తవంలో 10 రెట్లు ఉండే అవకాశం
» 4,200 భవనాలకు పన్నులు తగ్గింపు
» రూ.6 కోట్లకు పైగా ఆదాయానికి గండి

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

అంతా అడ్డగోలు వ్యవహారమే. నాటి వైసీపీ ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి పుర అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొత్త నిర్మాణాలకు పన్నులే విధించకపోగా అప్పటి వరకూ ఉన్న ఆస్తిపన్నులను సైతం కేటగిరీలు, భవనాల కొలతలు మార్చివేసి పుర ఆదాయానికి గండికొట్టారు.ప్రస్తుతం ప్రత్యేక బృందాలు చేస్తున్న సర్వేలో అధికారులు చేసిన పలు అడ్డ గోలు వ్యవహారాలు బయటపడుతున్నాయి. పన్నులు విధింపు, తగ్గింపువల్ల ఏడాదికి రూ.6 కోట్లకు పైగా పుర ఆదాయానికి గండిపడినట్టు వెలుగుచూడగా పూర్తిస్థాయిలో సర్వే నిర్వహిస్తే 10 రెట్లు పైగా ఉండే అవకాశం ఉంది. సర్వేలు, థర్డ్ పార్టీ అధికారుల బృందాలు నిర్వహించిన తనిఖీల్లో వెలుగుచూసిన అంశాల ఆధారంగా అప్పుడు పనిచేసిన బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు మునిసిపల్ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు.

సిబ్బంది ఇష్టారాజ్యం..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న పురపాలక సంఘాలు, నగర పంచాయతీలు, కార్పొరేషన్లలో గృహాలు, భవనాలు, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం పూర్తి కాగానే వాటిని గుర్తించి రెవెన్యూ విభాగంలోని సిబ్బంది, అధికారులు కొలతలు తీసుకుని పన్నులు విధించాలి. పలు పట్టణాలు, నగరాల్లో ఈ ప్రక్రియ సజావుగా సాగలేదు. చాలా చోట్ల కొత్త నిర్మాణాలను గుర్తించే ప్రక్రియే నిర్వహించలేదు. దీనివల్ల పుర ఆదాయానికి ఏటా భారీగా గండి పడుతోంది.అప్పటికే పన్నులు విధించిన భవనాల కొలతలు తగ్గించి చూపించడం, వాణిజ్య సముదాయాలు, షాపులు ఉన్నా వాటిని నివాసగృహాలుగా చూపించి తక్కువ పన్నులు విధించి చూపారు. ఈ లొసుగులను మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయంలోని టెక్నికల్ టీమ్ గుర్తించింది.వీటన్నింటి వెనుక అప్పటి వైసీపీ నాయకులు,పుర ప్రతినిధులు ఒత్తిళ్లు ఉన్నట్టు సమాచారం.


అడ్డగోలు తగ్గింపులు

వాణిజ్య భవనాలను నివాసగృహాలుగా చూపించడం, కొలతలు తగ్గించడం, భవన పూర్తి విస్తీర్ణాలు పరిగణలోకి తీసుకోకపోవడం వంటి కారణాలతో భవనాలకు పన్నులు తగ్గించి చూపించినట్లు గుర్తించారు. దీనివల్ల 3032 అన్నిరకాల భవనాలకు సంబంధించి రూ.2.25 కోట్లు ఆదాయాన్ని పుర, స్థానిక సంస్థలు కోల్పోయాయి.దీంతో పాటు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ కార్యాలయంలోని టెక్నికల్ టీమ్ ఆన్‌లైన్‌లో పన్నుల మదింపును పరిశీలించగా 1195 నిర్మాణాలకు విస్తీర్ణం మార్పు లేకుండానే పన్నుల తగ్గించినట్టు గుర్తించారు. దీంతో వీటిపై మునిసిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బందితో బృందాలు ఏర్పాటు చేసి జంబ్లింగ్ పద్ధతిలో తనిఖీలు చేశారు. ఇక్కడ మరో రూ.1.50 కోట్ల వరకూ తేడాలు గుర్తించినట్టు సమాచారం.



గోదావరి ఉధృతం

ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న నీటి మట్టం
4,84,214 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. తెలంగాణ పరివాహకంలోని కడెం, శ్రీపాదయల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి విడుదల చేసిన వరద నీటితో కాళేశ్వరం, పేరూరు వద్ద నీటి మట్టం పెరుగుతూ గోదావరికి చేరుతుంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని అంచనా వేస్తూ ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ గేట్లను మరింత పైకి ఎత్తి వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి బ్యారేజ్ 175 గేట్లను 1.5మీటర్ల మేర పైకి ఎత్తి 4,84,214 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలివేస్తున్నారు. దీంతో గోదావరి నీటి మట్టం 9.80 అడుగులుగా నమోదైంది. డెల్టా పరిధిలో విస్తారంగా కురుస్తున్న వర్షాల వల్ల వ్యవసాయ అవసరాలకు నీటి విడుదలను మరింత తగ్గించారు. తూర్పుడెల్టా కాలువకు 1500 క్యూసెక్కులు, మధ్యడెల్టా కాలువకు 200 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 500క్యూసెక్కులు చొప్పున 2200క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి 33.70 అడుగులకు చేరుకుంది. నీటి మట్టం మరో 5 అడుగులకు పెరగవచ్చని అధికారుల అంచనా.

తీరం కల్లోలం

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో లంగర్‌పై బోట్లు



ఉప్పాడ తీరంలో కెరటాలతో కల్లోలంగా ఉన్న సముద్రం

కొత్తపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరం కల్లోలంగా మారింది. ఉప్పాడ, అమీనబాద్, మాయాపట్నం, సూరాడపేట, కొత్తపట్నం తదితర తీరప్రాంత గ్రామాల నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారులు బోట్లకు సముద్రంలో లంగర్లు వేసి ఒడ్డుకు చేరుకున్నారు. రాత్రికి లేదా సోమ వారం ఉదయానికి తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని మత్స్యకారులు చెప్తున్నారు. ఈసారి సముద్రం ఉగ్రరూపం దాలిస్తే మాయాపట్నం నుంచి కొత్తపట్నం తీరం వరకు కెరటాలు రోడ్డుపైకి దూసుకొచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అతి వేగం.. తీసింది ఇద్దరి ప్రాణం!

- ఆటోను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే ఒకరు.. చికిత్స పొందుతూ మరొకరు మృతి
- కోరింగలో ఘటన



మృతిచెందిన యేసు, లక్ష్మి ఫైల్‌ఫొటోలు



కోరింగలో రోడ్డు ప్రమాద దృశ్యం

తాళ్లరేవు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోరింగ 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కొత్త కోరింగ గ్రామానికి చెందిన నిమ్మితి యేసు(50) రోడ్డు పక్కన నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. పాతకోరింగ గ్రామానికి చెందిన అబరుకుల లక్ష్మి(55), దడాల లక్ష్మి ఆటోలో కొత్త కోరింగలో ఓ చర్చికి వచ్చి తిరిగి వెళ్లేందుకు రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన ఆటోలో కూర్చుని డ్రైవర్ కోసం వేచి చూస్తున్నారు. ఇంతలో యానాం నుంచి అతి వేగంగా వచ్చిన కారు వెనుకనుంచి నిమ్మితి యేసును ఢీకొని ఆ ముందు రోడ్డుపక్కన ఆగిఉన్న ఆటోను ఢీకొనడంతో ఆటో పల్టీ కొట్టింది. కారు పక్కకు దూసుకుపోయింది. దీంతో నిమ్మితి యేసు అక్కడికక్కడే మృతిచెందాడు. అబరుకుల లక్ష్మి, దడాల లక్ష్మికి తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించగా అబరుకుల లక్ష్మి చికిత్స పొందుతూ మరణించింది. దడాల లక్ష్మి చికిత్స పొందుతుంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణమైన కారును పోలీసులు కోరింగస్టేషన్‌కు తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

3 కిలోల సీజ్
రాజోలు సీఐ నరేష్‌కుమార్



రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేష్‌కుమార్

రాజోలు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి రూ.12వేలు విలువ చేసే 3 కిలోల గంజాయిని సీజ్ చేశామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. రాజోలు సర్కిల్ పోలీస్‌స్టేషన్ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గంజాయి రవాణా అరికట్టడానికి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఉత్తర్వుల ప్రకారం కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణలో రాజోలు సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో పాత గంజాయి నేరస్తులపై నిఘా పెట్టడంతో రీవిజన్ ప్రోగ్రాంలో భాగంగా పాత నిందితులను పోలీసు స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ చేసిన తరుణంలో ఈ నెల 16న గంజాయి రవాణాపై మలికిపురం ఎస్‌ఐ పి.సురేష్‌కి సమాచారం అందింది. మలికిపురం మండలం శంకరగుప్తంలో చవ్వాకుల నితీష్ స్వగృహంలో గంజాయిని కలిగి ఉండి వ్యాపారం చేస్తున్న వారి నుంచి మలికిపురం మండలం డిప్యూటీ తహశీల్దార్, వీఆర్వోల సమక్షంలో ఎస్‌ఐ సురేష్ 3కిలోల గంజాయిని సీజ్ చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అర్బన్‌కు చెందిన ఎ.ప్రశాంత్‌కుమార్, మలికిపురం మండలం శంకరగుప్తానికి చెందిన చవ్వాకుల నితీష్, పడమటిపాలెంకు చెందిన తాడి హరీష్‌బాబు, బట్టేలంకకు చెందిన కె.మనోజ్, చింతలమోరికి చెందిన బి.దిశాన్‌కుమార్, కేశనపల్లికి చెందిన జి.శ్యామ్సన్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితుల తల్లిదండ్రులు కుటుంబపోషణ నిమిత్తం గల్ఫ్ దేశాల్లో ఉండడం వల్ల వారి పర్యవేక్షణ లేకపోవడం వల్ల గంజాయి వంటి చెడు వ్యసనాలకు బానిసలయ్యారని తెలిపారు. గంజాయి రవాణాపై సమాచారం ఉన్న పోలీసులకు టోల్‌ఫ్రీ 1972లో సమాచారం అందజేయాలని సీఐ కోరారు.

కుమారుడి కోసం వెళ్తూ కన్నుమూత

బస్సు ఢీకొని వ్యక్తి మృతి



రమేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సునీత

కరప, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వలసపాకల గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ తోట సునీత తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పూజారిపాలెం గ్రామానికి చెందిన పొనుగుపాటి రమేష్(31) రావులపాలెంలోని ఒక మిఠాయిషాపులో పనిచేస్తున్నాడు. అతడికి వివాహమై ఇద్దరు కుమారులున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న కుమారుడు వివేక్ వర్ధన్‌ను ఇటీవల కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కుమారుడికి అవసరమైన దుస్తులు తీసుకురావడానికి రమేష్ ఆదివారం ఉదయం బైక్‌పై కాకినాడ నుంచి పూజారిపాలెం బయలుదేరాడు. వలసపాకల గ్రామ శివారుకు వెళ్లేసరికి రామచంద్రపురం నుంచి కాకినాడ వైపు వస్తున్న కావేరి బస్సు అతివేగంగా అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో కుడి భుజానికి బలమైన రక్తపు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సునీత ఘటనా స్థలికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నటరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వివరించారు.

దొరికిన అడవి పంది

నలుగురిని గాయపరచడంతో పట్టుకున్న స్థానికులు



ఐ.పోలవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం ఐ.పోలవరం, కేశనకుర్రుల్లో నలుగురిని గాయపరిచిన అడవి పందిని స్థానికులు బంధించారు. తీవ్రంగా గాయపడిన ఐ.పోలవరానికి చెందిన దంగుడుబియ్యం వెంకటరాజారావు కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. మరో ముగ్గురు టి.కొత్తపల్లి ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఐ.పోలవరం నుంచి కేశనకుర్రులోకి ప్రవేశించిన అడవిపంది అక్కడి జనాలపై దాడికి పాల్పడింది. దీనితో స్థానికులు అడవిపందిని బంధించారు. అటవీ శాఖాధికారులకు అందజేశామని తెలిపారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

రూ.9.80 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న వస్తువులు

అన్నవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పరిసర పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇటీవల జరుగుతున్న వరుస చోరీలపై జిల్లా ఎస్పీ ఆదేశాలతో పెద్దాపురం డీఎస్పీ, ప్రత్తిపాడు సీఐ పర్యవేక్షణలో భాగంగా ఆదివారం అన్నవరం జాతీయ రహదారిపై ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.9.80 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ శ్రీ హరిరాజు తెలిపారు. రంపచోడవరానికి చెందిన అడపా సూర్యచంద్ర, కిర్లంపూడికి చెందిన అడపా జోగా అమర్‌గంగాధర్ హైదరాబాద్, వైజాగ్, తుని, ప్రత్తిపాడు, అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడేవారని పేర్కొన్నారు. 16 కేసుల్లో నిందితుల నుంచి 13 మోటార్‌బైక్‌లు, అర కిలో వెండి వస్తువులు, టీవీ, అమ్మవారికి ధరించే రోల్డ్‌గోల్డ్ హారం స్వాధీనం చేసుకోగా ఈ సొత్తు విలువ రూ.9.80 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి ప్రత్తిపాడు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచామన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు, అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తదితరులు ఉన్నారు.

ఆర్చరీ పోటీల్లో పిఠాపురం ఫస్ట్



పోటీల్లో విజేతలకు మెడల్స్ ప్రదానం

పిఠాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ బాలబాలికల పోటీలు ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగాయి.ఒక పక్కన వర్షం పడుతున్నా క్రీడాకారులు తమ లక్ష్యం వైపు గురిచూసి విజేతలుగా నిలిచారు. రాజమహేంద్రవరం, అమలాపురం, రాజోలు, కాకినాడ, పిఠాపురం, తుని తదితర ప్రాంతాల క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ఇండియన్ రౌండ్ కేటగిరీలో పోటీపడ్డారు.ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో పిఠాపురం క్రీడాకారులు మొదటి స్థానంలో నిలవగా, కాకినాడ రెండు, అమలాపురం మూడో స్థానంలో నిలిచారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ ప్రారంభించారు. పోటీలను వీక్షించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ బోడ సతీష్, నాయకుడు అల్లవరపు నగేష్, జనసేన నాయకుడు మర్నీడి రంగబాబు, కాకినాడ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్ పాల్గొనగా,ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు పోటీలను పర్యవేక్షించారు.న్యాయ నిర్ణేతలుగా పి.కృష్ణ, కె.చిన్నబ్బాయి, ఎం.గణేష్, జె.ప్రసాదరావు వ్యవహరించారు.విజేతలను కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్,ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం అభినందించారు.

పాదగయలో 22న సామూహిక వరలక్ష్మి వ్రతాలు

10వేల చీరలు సమకూరుస్తున్న పవన్‌కల్యాణ్.. ఐదు బ్యాచ్‌లుగా నిర్వహణ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరిప్రసాద్, కేకే తదితరులు

పిఠాపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల సన్నిధిలో ఈనెల 22న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. వ్రతాలు ఆచరించే మహిళా భక్తులకు డిప్యూటీ సీఎం, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ 10వేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. వ్రతాల నిర్వహణ ఏర్పాట్లను ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన ప్రోగ్రామ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్, చక్రవర్తి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ ఐదు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహిస్తామని, ఈ బ్యాచ్‌లకు అంబిక, భ్రమరాంబ, చాముండి, దుర్గ, ఈశ్వరీలుగా నామకరణం చేశామన్నారు. ఉదయం 5గంటలు నుంచే వ్రతాలు ప్రారంభవుతాయని తెలిపారు.అంతకు ముందు పాదగయలో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సీఐ జి.శ్రీనివాస్, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

గోపాలపురంలో ఉట్టి వివాదం

ఇరువర్గాల ఘర్షణ.. పోలీస్‌స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు

గోపాలపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో శనివారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. దీనిలో భాగంగా ఉట్టి కొట్టే సమయంలో ఇద్దరి వ్యక్తుల మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాలు రెండు వర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉట్టికొట్టిన నేపథ్యంలో ఇద్దరు వ్యక్తుల మధ్య వాట్సాప్ వాయిస్ మెసేజ్‌ల రూపంలో గొడవ ప్రారంభమైంది.దీంతో ఒక యువకుడిపై ఇంకొందరు దాడిచేశారు. తనపై దాడి చేశారంటూ సదరు యువకుడు ఆదివారం తన స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడిగేందుకు యత్నించగా వారిపై కూడా ఆదివారం రాత్రి దాడిచేశారు. దీంతో మరోసారి వివాదం ఏర్పడింది. దీంతో ఒకరిపైఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. విషయం తెలుసుకుని అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీఐ నాయక్‌లకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడినట్టు సమాచారం.

నేడు వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న కాకినాడ వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.ఈ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్, బీబీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 77993 76222లో సంప్రదించాలన్నారు.

రేపు సామర్లకోటలో వేదశాస్త్ర పండిత సన్మాన సభ

సామర్లకోట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 19న సామర్లకోట బాలాత్రిపుర సుందరి వేదశాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో 27వ వేద శాస్త్ర పండిత సన్మానసభ జరుగనున్నట్టు నిర్వాహక కమిటీ కన్వీనర్ గ్రంధి రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి పలువురు వేదపండితులు ఈ సభకు హాజరై చతుర్వేద పారాయణం చేస్తారన్నారు. అనంతరం పండితులకు సత్కారం నిర్వహించనున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అమలకంటి శ్రీనివాసరావును సన్మానిస్తామని రామకృష్ణ తెలిపారు.

ఏలేరు జలాశయంలో 11.77 టీఎంసీల నీటి నిల్వలు



ఏలేశ్వరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న సహజ ప్రవాహంతో పాటు గోదావరి జలాలు కూడా వచ్చి చేరడంతో ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు స్వల్పంగా పెరుగున్నాయి. ఎగువ నుంచి 1871, పురుషోత్తపట్నం నుంచి 1225 క్యూసెక్కుల చొప్పున నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా ఆదివారం 11.77 టీఎంసీలకు నీటి నిల్వలు చేరాయి. జలాశయం పూర్తిసాయి నీటి మట్టం 86.56 మీటర్లు కాగా ప్రస్తుతం 78.49 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ నుంచి విశాఖపట్నానికి 200 క్యూసెక్కులు, ఏలేశ్వరంలోని తిమ్మరాజు చెరువుకు 400 క్యూసెక్కుల చొప్పున నీరు చేరుతోంది. కాలువలకు సాగు నీరు విడుదలవ్వడంతో రైతులకు పంటలపై భరోసా ఏర్పడింది.

నిర్వాసితులపై నిర్లక్ష్య ధోరణి

- సీపీఎం ఆలిండియా సెక్రటరీ బేబి
- పోలవరం నిర్వాసిత ముంపు మండలాల్లో పర్యటన



ఆదివాసీ సంప్రదాయ నృత్యం చేస్తున్న బేబీ

చింతూరు/వీఆర్ పురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి కారణంగా పోలవరం నిర్వాసితులకు అన్యాయం జరిగిందని సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. పోలవరం నిర్వాసిత ముం పు మండలాల పర్యటనలో భాగంగా సీపీఎం కేంద్ర కమిటీ ఆదివారం చింతూరు, వీఆర్ పురం మండలం రామవరం, ఎటపాక మండలం రామ్‌గోపాలపురంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో బేబీ మాట్లాడుతూ నిర్వాసితులకు జరిగిన అన్యాయంపై రాజ్యసభ, లోక్‌సభల్లో నిలదీస్తామన్నారు. పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన జరగలేదని, కాలనీలు కూడా నాసిరకంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు నిర్వాసితులను ఏకం చేసి న్యాయమైన పునరావాసం, పరిహారం అందే వరకు పోరాటం చేస్తామన్నారు.వైసీపీ హయాంలో సహా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు అన్ని మౌలిక వసతులతో కూడిన కాలనీలు నిర్మించాలన్నారు. భూములు త్యాగం చేసిన వారికి ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలని, ఇంటికో ఉద్యోగం కల్పించాలన్నారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు, సీపీఎం పార్టీ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం మాట్లాడుతూ రామవరం గ్రామంలో మొత్తం 279 ఇళ్లు ఉండగా రోడ్డుకు ఒకవైపు ఉన్న 166 ఇళ్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని, రోడ్డుకు మరో వైపు ఉన్న ఇళ్లు ముంపు జాబితాలోకి రావా అని ప్రశ్నించారు. తొలుత సీపీఎం బృందానికి చింతూరులో పార్టీ శ్రేణులు, ఆదివాసీలు సంయుక్తంగా కొమ్ము నృత్యాలతో స్వాగతం పలికాయి. గ్రామ సెంటర్‌లో ఉన్న అమరవీరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, కార్యవర్గ సభ్యులు వాణిశ్రీ, తులసీదాస్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏడిదలో పార్కు ప్రారంభం

స్వీయ నిధులు రూ.5 కోట్లతో ఆధునీకరించిన దాత నామాల



ఆధునీకరించిన పార్క్‌లో ఏర్పాటు చేసిన లాన్

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నామాల పురుషోత్తం జన్మభూమి రుణం తీర్చుకుంటున్నారు. స్వగ్రామం ఏడిదలో పంచాయతీకి చెందిన పెద్ద చెరువు 6.14 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఆ చెరువును పురుషోత్తం దత్తత తీసుకుని సొంత నిధులు రూ.5 కోట్ల వ్యయంతో ఆధునికరించారు. వాకింగ్ ట్రాక్, లాన్, సోలార్ సిస్టం లైటింగ్, ప్రహరీ, చెరువు మధ్యలో 22 అడుగుల స్వామి వివేకానంద విగ్రహం, చిన్నపిల్లల ఆడుకునేందుకు ఉయ్యాలలు, పెద్దలకు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ పార్కును ఈ నెల 18న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించనున్నారు. నామాల పురుషోత్తం, అనంతలక్ష్మి దంపతులు పేరిట నిర్మించిన పార్కు ఏడిద వాసులకు ఆహ్లాదం అందించనుంది. ఇదిలా ఉండగా స్థానిక జడ్పీ హైస్కూల్లో ప్లస్‌టు బాలికల జూనియర్ కళాశాలకు అవసరమైన భవనాలను రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఈ పాఠశాలలో టెన్త్, ఇంటర్‌లో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.2 లక్షలు, రూ.5 లక్షలు ఏటా అందిస్తున్నారు. అలాగే పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఫర్నీచర్ సమకూర్చారు.ఆడిటోరియం నిర్మించారు. మూడంతస్తుల భవనం నిర్మించి అందులో కంటి ఆసుపత్రి, లైబ్రరి, వీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేశారు. గ్రామానికి చేస్తున్న సేవలను వెలకట్టలేమని సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం కొనియాడారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ విజేత అనంతపురం



అనంతపురం బాలికల జట్టుకు కప్ బహూకరిస్తున్న మర్రెడ్డి శ్రీనివాస్

పిఠాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జరుగుతున్న 10వ రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు బాలబాలికల విభాగాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లు విజేతగా నిలిచాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, తూర్పుగోదావరి, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి.బాలుర విభాగంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 13 జట్లు, బాలికల విభాగంలో 12 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో అనంతపురం జట్టు విజేతగా నిలవగా... పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల జట్లు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలవగా, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల జట్టు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఆదివారం రాత్రి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పిఠాపురం అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొగలి కాశీవిశ్వనాథ్,బొజ్జా మాణిక్యాలరావు, కొత్తెం సుందరకుమార్,రాష్ట్ర, ఉమ్మడి జిల్లాల అసోసియేషన్ల ప్రతినిధులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

లొల్లాలమ్మకు రూ.9.30 లక్షల విలువైన బంగారు హారం



ఆత్రేయపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామదేవత లొల్లాలమ్మకు మాజీ సర్పంచ్ దివంగత కాయల వెంకట్రావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.9.30 లక్షలు విలువైన బంగారు హారం సమర్పించారు. ఆదివారం కుమారుడు కాయల జగన్నాథం (సర్పంచ్), కాయల నాగేశ్వరరావు, కాయల సత్యనారాయణలు బంగారు హారాన్ని ఊరేగింపుగా తీసుకుని వెళ్లి అమ్మవారికి బహూకరించగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బసవేశ్వరస్వామి ఆలయానికి భూమిపూజ

మండపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):12వ వార్డులో పునర్నిర్మించే బసవేశ్వరస్వామి ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వేర్వేరుగా శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

ద్రాక్షారామ,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొక్కపెళ్లి శ్రీనివాస రావు, ప్రధానకార్యదర్శిగానరేం ద్రకుమార్, కోశాధి కారిగా బాబూరావు, ఉపాధ్యక్షులుగా నిమ్మకాయల మహాలక్ష్మీ, ఎన్.నరసింహమూర్తి, సహాయకార్యద ర్శిగా టి.గోపి,బంగారు కొండను ఎన్నుకున్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



అంబాజీపేటలో మార్కెట్ కమిటీ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం ఆదివారం అట్టహాసంగా సాగింది. అయినవిల్లి మండలం నుంచి చైర్మన్‌గా నియమితులైన చిట్టూరి శ్రీనివాసు, కొర్లపాటివారిపాలానికి చెందిన కొర్లపాటి వెంకటేశ్వరరావు, డైరెక్టర్లుగ్రామాల నుంచి భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ప్రమాణస్వీకార మహోత్సవంలో అతిథులుగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ సహకార ఆర్థిక సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్ పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత కూటమి నేతలు భారీ ర్యాలీగా చైర్మన్ శ్రీనివాసు, వైస్‌చైర్మన్ వెంకటేశ్వరరావుతో కలిసి సభ వద్దకు తరలివచ్చారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నీటిపారుదల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంత కుమారి, నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, నాయకులు మద్దాల సుబ్బారావు, సయ్యపురాజు సత్తిబాబురాజు, నేదునూరి వీర్రాజు, షైపా ల తాతాజీ, కొర్లపాటి గోపి, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, జాలెం శ్రీనివాసరాజా, గుడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ, అరిగెల సూరిబాబు పాల్గొన్నారు.

పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం: మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చిట్టూరి శ్రీనివాసు, వైస్‌చైర్మన్‌గా కొర్లపాటి వెంకటేశ్వరరావు, సభ్యులుగా అడబాల సూర్యావతి అంబటి గంగా భవాని, కముజు నాగసత్య, కోసూరి పోచమ్మ, మట్టపర్తి సోమేశ్వరరావు, మేడిశెట్టి మంగతాయారు. మోర్త వీరవెంకటసత్యనారాయణ, నేదునూరి కుమారి, సలాది ప్రసాద్, గంధం వెంకటేశ్వరరావు, వక్కపట్ల ఆదిలక్ష్మి, దుర్గా శ్రీనివాసరావు, కుడుపూడి సత్యవేణి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి ప్రమాణస్వీకారం చేశారు.

ముమ్మిడివరంలో స్వచ్ఛాంధ్ర ఎక్కడ?

- 25రోజులుగా పడకేసిన పారిశుధ్యం
- మరమ్మతులకు గురైన కాంపెక్టర్
- కంపు కొడుతోన్న వీధులు



కృష్ణ థియేటర్ వద్ద నిండిపోయి ఉన్న డస్ట్‌బిన్

ముమ్మిడివరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి.. తడి, పొడిచెత్త వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించండి.. స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కండి అంటూ మైకుల్లో ప్రచారంలో హోరెత్తిస్తున్నా ఆ దిశలో మాత్రం అది ఎక్కడా కనిపించడం లేదు. వీధుల్లో ఏర్పాటుచేసిన డస్ట్‌బిన్లలో చెత్తను ఏ రోజుకు ఆ రోజు తొలగించకపోవడంతో అది కుళ్లి కంపు కొడుతోంది. ముమ్మిడివరం నగర పంచాయతీలో ఎక్కడకు వెళ్లినా ఇదే పరిస్థితి దర్శనమిస్తుంది. పెళ్లిళ్ల సీజన్, పండుగల సీజన్ కావడంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త ఎక్కువగా పేరుకుపోయింది. కాంపెక్టర్ మిషన్ (చెత్తను తొలగించే మిషన్) మరమ్మతులకు గురవడంతో ఈసమస్య తీవ్రంగా ఉంది. పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలో లేకపోవడం.. చెత్తను తరలించేందుకు సరైన సంఖ్యలో వాహనాలు లేకపోవడంతో పారిశుధ్య సమస్య తలెత్తుతోంది. ముమ్మిడివరం నగరపంచాయతీ పరిధిలో 25,355మంది జనాభాఉండగా, 3,4,17,19 వార్డుల పరిధిలో షాపులు, హోటళ్లు, ఆసుపత్రులు, అపార్టుమెంట్లు, నివాస గృహాలు ఎక్కువగా ఉండడంతో అక్కడ చెత్త సమస్య తీవ్రంగా ఉంది. నగర పంచాయతీకి 60మంది పారిశుధ్య కార్మికులు అవసరంగా కాగా కేవలం 34మంది మాత్రమే ఉన్నారు. వీరిలో ఒక్కరు పర్మినెంట్ ఉద్యోగి కాగా 27మంది అవుట్ సోర్సింగ్, ఆరుగురు రోజూవారీ పారిశుధ్య కార్మికులు పనిచేస్తోన్నారు. చెత్తను వేయడానికి 22డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారు. ఇవి కాక ఏడు సచివాలయాల పరిధిలో చెత్తను సేకరించేందుకు ఏడు బ్యాటరీ వాహనాలు కూడా ఏర్పాటు చేశారు. డస్ట్‌బిన్‌లో వేసిన చెత్తను కాంపెక్టర్ ద్వారా తీసి ట్రాక్టర్లతో తరలిస్తుంటారు. అయితే కాంపెక్టర్ 25రోజుల క్రితం మరమ్మతులకు గురి కావడంతో దాన్ని మూలన పడవేశారు. డస్ట్‌బిన్‌లో వేసిన చెత్తను కార్మికులు చేతికందినంత వరకే తీసి ట్రాక్టరులో వేసి తరలిస్తున్నారు. అయితే డస్ట్‌బిన్‌లోని చెత్తను పూర్తిగా తొలగించకపోవడానికి వారికి వీలు పడకపోవడంతో పైపైనే తీసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దీంతో ఆయా డస్ట్‌బిన్లలో మిగిలిన చెత్త కుళ్లి కంపు కొడుతోంది. రోజుల తరబడిచెత్త నిల్వ ఉండడంతో కుళ్లిపోయి దుర్గంధం వెలువడుతుంది. ఆ మార్గాన వెళ్లే ప్రజలు ముక్కును మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. డస్ట్‌బిన్‌లో వేసిన చెత్తను కుక్కలు, పందులు కిందకు లాగి చిందరవందర చేస్తున్నాయి. పెళ్లిళ్లు, పండుగల సీజన్ కావడంతో చెత్త మరీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఈగలు, దోమలు పెరిగిపోయి దుర్గంధం వెలువడుతుంది. నగర పంచాయతీ అధికారులు స్పందించి డస్ట్‌బిన్‌లోని చెత్తను పూర్తిగా తీయించి దాన్ని తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'జీవో 137ను రద్దు చేయకపోతే ఆందోళన ఉధృతం'



మాట్లాడుతున్న ఈయూ జోనల్ ఆర్గనైజేషన్ కార్యదర్శి సత్యనారాయణ

అమలాపురం రూరల్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలాన్ని లూలూ షాపింగ్ మాల్‌కు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబరు 137ను రద్దు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ ఆర్గనైజేషన్ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ హెచ్చరించారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఎంప్లాయీస్ యూనియన్ జిల్లాశాఖ అధ్యక్షుడు పలివెల సత్తిబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విజయవాడలో ఆర్టీసీకి సంబంధించిన 415ఎకరాల స్థలాన్ని లూలూ షాపింగ్‌మాల్‌కు కట్టబెట్టడం దారుణమన్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడు సత్తిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14నెలలు గడిచినా ఇంత వరకు డీఏ బకాయిలు చెల్లించలేదన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా బకాయిల విడుదలతో పాటు 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు ఐఆర్ అందించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుల్‌రజాక్ కోరారు. సమావేశంలో ఈయూ జిల్లా కార్యదర్శి మేడిది శ్రీనివాసరావు, డిపో కార్యదర్శి ఎస్ఎస్‌వీ గణేష్ పాల్గొన్నారు.

మునిగిన వరి చేలు.. ఆందోళనలో అన్నదాతలు



కాట్రేనికోనలో నీటిలో నానుతున్న వరి చేను

కాట్రేనికోన, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కాట్రేనికోన మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈఅకాల వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవలే వరినాట్లు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని గొరగనమూడి, చెయ్యేరు పరిసర ప్రాంతాల్లో వరిచేలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో నాట్లు కుళ్లిపోయే ప్రమాదముందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి రైతులతో పాటు ఆక్వా రైతులకు కూడా ఈవర్షాలు కష్టాలు తెచ్చిపెట్టాయి. వాతావరణం చల్లగా మారడంతో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయి రొయ్యల పెంపకానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనితో రైతులు నిరంతరం ఎయిరేటర్లను ఉపయోగించవలసి వస్తోంది. ఈకారణంగా విద్యుత్ వినియోగం పెరగడం, విద్యుత్ లేని సమయంలో జనరేటర్ల కోసం డీజిల్ వినియోగించడం వల్ల ఆర్థిక భారం పెరుగుతోందని ఆక్వా రైతులు వాపోతున్నారు. వాతావరణశాఖ నివేదిక ప్రకారం రాబోయే రెండు రోజుల పాటు ఇదేవాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనితో వరిరైతులు, ఆక్వా రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఆలోచిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వర్షాల వల్ల కలిగిన నష్టాలను అంచనా వేసి సహాయం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గొల్లపుంతకాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈకాలనీలో 2వేలకు పైబడి కుటుంబాలు ఉంటున్నా రేషన్ దుకాణం అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని ఆరోపిస్తున్నారు. పట్టణంలోకి వెళ్లిరావాలంటే 3 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుందన్నారు.

యానాం ఎమ్మెల్యేగా పోటీ చేస్తా

- కాంగ్రెస్ నేత రామ్మూర్తి



యానాం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే యానాం నుంచి ఎమ్మెల్యేగా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కాటంశెట్టి రామ్మూర్తి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యానాంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. 14ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ యానాం ప్రజలకు సేవా కార్యక్రమాలు చేశానన్నారు. యానాంలో ప్రతి ఎన్నికల్లో కొత్త రాజకీయ నాయకుడు పోటీ చేస్తుండటం వల్లే 25 ఏళ్లుగా మల్లాడే ఎమ్మెల్యేగా పనిచేశారన్నారు. గత ఎన్నికల్లో మల్లాడి పోటీ చేయకపోవడం వల్లే గొల్లపల్లి శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలిచారన్నారు. ఎమ్మెల్యే గొల్లపల్లి నాలుగేళ్లుగా ప్రజలకు ఏవిధంగా ఉపయోగపడలేదన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన తోట రాజు గురించి తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో యానాం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్థాని దినేష్, మెల్లం చిన్నా పాల్గొన్నారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

అమలాపురంటౌన్,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి 70వపుట్టినరోజును పురస్కరించుకుని మెగాఅభిమానుల ఆధ్వర్యంలో ఆదివారం నుంచి వారోత్సవాలను ప్రారంభించారు. స్థానిక మహిపాలవీధిలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో చిరంజీవి పేరిట పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సేవాకార్యక్రమాలను వారంరోజులు నిర్వహిస్తున్నట్టుఅభిమాన సంఘాల నాయకులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లానాయుడుతెలిపారు. వర్రే శేషు, గొర్తి పవన్, పోలిశెట్టి రాము, నల్లా చిన్నీ, చాగంటి వరప్రసాద్, ఆచంట శ్రీను, వేమన నరసింహారావు, జనిపిరెడ్డి హరి, గారపాటి వీరభద్రరావు, తిక్కిరెడ్డి రాజా, ఈమని సాయికృష్ణశర్మ, సువర్ణరత్నాకర్ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కుందాలపల్లిలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. కుందాలపల్లి గ్రామంలో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసి అనంతరం మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రధాన రహదారులన్నీ సుమారుగా అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో నాబార్డు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కుందాలపల్లిలో 1139మీటర్ల బీటీ రోడ్డుకు నాబార్డు నిధులు రూ.77.30 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఇప్పటికే మామిడికుదురులో బీటీరోడ్డు నిర్మాణం జరుగుతుందని, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో కూడా రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ జేఈ సంపత్, సర్పంచ్ పప్పుల శ్రీనివాసరావు, నగరం ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, నీటి పారుదల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ పప్పుల సాయిరాం, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, పప్పుల సత్తిబాబు, ఇందుకూరి రఘువర్మ, గనిశెట్టి శ్రీనివాసరావు, కాసర నాగేశ్వరరావు, అరిగెల సూరిబాబు, యర్రంశెట్టి తాతకాపు, కొమ్ముల శ్రీను, పప్పుల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

1,800 ఎకరాల ఆయకట్టుకు తప్పిన ముప్పు



పూడిక తొలగించిన సమనస డ్రెయిన్

ఉప్పలగుప్తం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): సమనస డ్రెయిన్ కిత్తనచెరువు ప్రాంతంలో గుర్రపుడెక్క, ఆక్వా చెరువుల వ్యర్థాలతో పూడుకుపోయింది. సార్వా నాట్లకు ముంపు దెబ్బ తగలడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితిని నీటి సంఘం చైర్మన్ బండారు వెంకటేశ్వరరావుకు వివరించడంతో ఆయన వెంటనే స్పందించారు. డ్రెయిన్స్ డీఈఈ కిశోర్‌కుమార్‌ను రప్పించి డ్రెయిన్ దుస్థితిని చూపించారు. వెంటనే ఆయన యంత్రాల సహాయంతో డ్రెయిన్‌లో పూడికను తొలగించారు. ఆక్వా చెరువుల నుంచి వ్యర్థ జలాలను డ్రెయిన్‌లోకి వదలడం వల్ల డ్రెయిన్ మూసుకుపోతోందని రైతులు ఆరోపించారు. డ్రెయిన్స్ ఏఈ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జలకం

అంబాజీపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నందంపూడి గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి జలకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థమహోత్సవంలో భాగంగా అమ్మవారి జలకాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవార్కి చలివిడి, పానకాలను భక్తులు సమర్పించారు. గ్రామస్థులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

భారీ వర్ష సూచనతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాజోలు, ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాజోలు నియోజకవర్గ ప్రత్యేకాధికారి కృష్ణమూర్తి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సఖినేటిపల్లి, రాజోలు, మలికిపురం మండలాల ఆయా శాఖల అధికారులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగినచర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరమైతే తప్పదూర ప్రాంతాలకు ప్రజలు ప్రయాణించరాదని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్లు సీహెచ్ భాస్కర్, పి.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు కె.సూర్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, ఏవో ఎంవీ సత్యనారాయణ, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ, డీఆర్డీఏ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, డ్రైనేజీ అధికారుల పాల్గొన్నారు.

రవాణాశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌కు సన్మానం

రాజోలు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వడ్డి సుందరంను సోంపల్లిలో ఆదివారం దళిత చైతన్యవేదిక రాష్ట్ర నాయకులు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈసందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ నిస్వార్థంగా సమాజానికి సుందరం చేసిన పలు సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జిల్లెల్ల వినోద్, రాష్ట్ర కోఆర్డినేటర్ చింతా శ్రీను, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, మందపాటి మధు పాల్గొన్నారు.

పేద కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైనరుబాబు

అమలాపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల పేద కాపు విద్యార్థుల విద్యాభివృద్ధికి సెప్టెంబరు మొదటి వారంలో ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్టు కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాత్వా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనరుబాబు తెలిపారు. కాత్వా ఆధ్వర్యంలో తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్రప్రభు సౌజన్యంతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న పేద విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈనెల20వ తేదీలోగా పేదకాపు విద్యార్థులను గుర్తించే బాధ్యత ఎంపిక చేయబడిన ప్రతినిధులకు అప్పగించారు. పదో తరగతి పైబడి ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, పోస్టుగ్రాడ్యుయేషన్ తదితర ఉన్నత చదువులు చదువుతున్న వారంతా ఉపకార వేతనం పొందేందుకు అర్హులన్నారు. దరఖాస్తులను మేడిచర్ల శ్రీనివాస్ సెల్ 9849441988, ప్రధానకార్యదర్శి నందెపు శ్రీనివాస్ సెల్ 9492387501, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైనరుబాబు సెల్ 7013476115, నూకల గురుప్రసాద్ సెల్ 9866479632కు అందించాలని కోరారు. సమావేశంలో నాయకులు కల్వకొలను తాతాజీ, కేకేవీ నాయుడు, ఎస్వీ నాయుడు, నాగిరెడ్డి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం ప్రధాన గోపురం ఎదుట ఉట్టి కొడుతున్న దృశ్యం

అంతర్వేది, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గోపురం ఎదుట ఉట్టి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారి గ్రామోత్సవం, సఖినేటిపల్లివారితో మురళీ కోలాటం అత్యంత వైభవంగా జరిగాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. భక్తులు, అర్చకులు, వాహనకారులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులు కేటాయించాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా నిధులు కేటాయించాలని ఆ సంస్థ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. ఆదివారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిని ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. స్వచ్ఛాంధ్ర నిధులు స్వచ్ఛత కోసం కేటాయిస్తానని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జయలక్ష్మి బాధ్యతల స్వీకరణ



మార్కెట్ కమిటీ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన అధికారి జయవెంకటలక్ష్మి

అమలాపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం స్థానిక సూర్యానగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌గా అధికారి జయవెంకటలక్ష్మి, వైస్ చైర్మన్ పరమట చిట్టిబాబులతో పాటు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి మోహనరావు ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. త్వరలోనే నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్టు జయలక్ష్మి వెల్లడించారు. మార్కెట్ కమిటీకి గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఉంటారు. సభ్యులుగా కంచిపల్లి శ్రీనాగమహాలక్ష్మి, మల్లుల పుల్లయ్య, కొండా హేమనాగసూర్యకుమారి, నూకల వెంకటసుబ్బారావు, రేకాడి సత్యనారాయణవర్మ, మంద గెద్దయ్య, కాకిలేటి సత్యవతి, పేరూరు మీనాక్షి, ఎన్.భవానీ, మోటూరి సుభాషిణి, యాళ్ల ప్రభాకరవెంకట గంగాధర రామారావు, పిల్లా శ్రీప్రసన్నాంజనేయులు, నాగిరెడ్డి సత్యనారాయణతో పాటు సొసైటీ అధ్యక్షులు, సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో నాయకులు మట్టా మహాలక్ష్మిప్రభాకర్, యెరుబండి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, లింగోలు పండు, అధికారి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

అనంతకుమారిని సన్మానించిన రజక చైతన్య సంస్థ



అంబాజీపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీసీ సహకార ఆర్థిక సహాయ సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రెడ్డి అనంతకుమారిని ఏపీ రాష్ట్ర రజక చైతన్య సేవాసంస్థ చైర్మన్ కాకినాడ రామారావు, సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమెను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం రజక సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. బీసీకార్పొరేషన్ ద్వారా మరిన్ని రుణాలు, రాయితీలు అందించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సూదికొండ రాముడు, పాలకొల్లు సత్యనారాయణ, అవిడి సూర్యచంద్రరావు, కేశనకుర్తి వెంకటేశ్వరరావు, నేదునూరి కళ్యాణ్, అధికారపు బాబ్జి, ఊనగట్ల నాగపోషికృష్ణ, పుల్లయ్య, కోటి, రాము తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిగా భాస్కరరాజు



త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

కాట్రేనికోన, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. టీడీపీ నాయకుడు ఇసుకపట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంతెన సత్యభాస్కరరాజు సొసైటీ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే వాకపల్లి అప్పారావు, వేరేటి ధనిష్ట సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ రైతుల ధాన్యం సొమ్ములను 24గంటలలోపే ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సత్యభాస్కరరాజు మాట్లాడుతూ రైతుల సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు నాగిడి నాగేశ్వరరావు, మోకా ఆనందసాగర్, మంతెన వెంకటసత్యనారాయణరాజు(బాబు), భూపతిరాజు శివకుమార్‌వర్మ(గబ్బర్‌సింగ్), నడింపల్లి సుబ్బరాజు, గుత్తుల సాయి, ఆకాశం శ్రీనివాస్, దాట్ల పవన్, డీసీసీబీ మేనేజర్ పి.శ్రీనివాస్, మండలంలోని పలు సొసైటీ చైర్మన్లు , సొసైటీ కార్యదర్శి కోటిపల్లి వరప్రసాద్, సిబ్బంది వరహాలరాజు, సురేష్, ధనశ్రీ, శరత్ పాల్గొన్నారు.

క్రాప పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా దేవనాగలక్ష్మి

అయినవిల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): క్రాప పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన బొబ్బిలి దేవనాగలక్ష్మి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం క్రాప పీఏసీఎస్‌లో సీఈవో బయ్యావరపు విశ్వశ్రీనివాస్ వర్మ అధ్యక్షతన జరిగింది. చైర్‌పర్సన్‌గా బొబ్బిలి దేవనాగలక్ష్మి, సభ్యులుగా పాటి గోవిందరావు, దుక్కుపాటి కృష్ణవేణి ప్రమాణ స్వీకారంచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల బొబ్బిలి సీతాదేవి, బొక్కా కామేశ్వరరావు, నాయకులు, సానబోయిన శ్రీను, బొబ్బిలి రాంబాబు, గంజి పేరయ్యానాయుడు, బొబ్బిలి అయ్యప్ప, కామిశెట్టి అంజి, బొబ్బిలి బ్రహ్మం, బొబ్బిలి చిన్నా, గంజి జాజి, పమిడికొండల నానాజీ, పాటి రామారావు, తాడేపల్లి కృష్ణ, పైగోడి సూర్యనారాయణ, సలాది బుచ్చిరాజు, అడపా నాగభూషణం, పడాలగిరి, మేడిద దుర్గాప్రసాద్, మద్దాల చంటి, బొబ్బిలిచిన్నంరాజు, బొబ్బిలి బూరియ్య, క్రాప, శంకరాయగూడెం గ్రామాలకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

అంబాజీపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు వర్షం నీటిలో మునిగాయి. వరి చేలలో ముంపు నీరు చేరడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరితోటల్లో వర్షం నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో కార్మికులు, ప్రజలు పనులు వెళ్లేందుకు ఇబ్బందులుపడ్డారు.

విఘ్నేశ్వర దేవస్థానానికి తులాభారం త్రాసు బహూకరణ



శ్రీవిఘ్నేశ్వర దేవస్థానానికి భక్తుడు బహూకరించిన ఇత్తడి త్రాసు

అయినవిల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తోటపేటకు చెందిన సత్తి సుబ్బారెడ్డి-సీతారత్నం దంపతులు ఆదివారం కుటుంబ సమేతంగా శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. దర్శనం అనంతరం భక్తులు రూ. 1.50లక్షల విలువైన తులాభారం తూచే ఇత్తడి త్రాసును దేవస్థానానికి బహూకరించారు. దాత దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

దాతల సౌజన్యంతో శస్త్ర చికిత్స గది ఏర్పాటు

అమలాపురం టౌన్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం పశువైద్యశాలలో చిన్న మూగజంతువుల ఆపరేషన్ థియేటర్‌ను జిల్లా పశుసంవర్థక అధికారి డాక్టర్ కె.వెంకట్రావు, ఉపసంచాలకుడు డాక్టర్ కర్నీడి మూర్తి ప్రారంభించారు. దాత సహకారంతో ఏరియా పశువైద్యశాలలో శస్త్రచికిత్స గదిని ఏర్పాటు చేసేందుకు సహకరించిన దాతలకు అభినందనలు తెలిపారు. కుక్కలకు, గొర్రెలు, మేకలకు శస్త్రచికిత్స చేయడానికి ఈగది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. దాతలు రామాయణం సురేష్, గ్రంథి సతీష్, గుప్తా, జయంతిలాల్ జైన్ తదితరులను అభినందించారు. కార్యక్రమంలో శాంతికమల, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, పశువైద్యాధికారులు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ కావ్య, డాక్టర్ మాధురి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. దాతల సహకారంతోనే పశువులకు ట్రేవిష్ షెడ్, వాల్ షెడ్, ఆపరేషన్ టేబుల్స్, ఆపరేషన్ థియేటర్, నాలుగు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసినట్టు విజయారెడ్డి వివరించారు.

ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

అమలాపురం టౌన్ ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల 69వ ఆవిర్భావ వేడుకలు అమలాపురం ప్రెస్‌క్లబ్ వద్ద ఆదివారం నిర్వహించారు. తొలుత ఏపీయూడబ్ల్యుజే పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంఎస్వీ ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు పరసా సుబ్బారావు, కొండేపూడి సత్యనారాయణ, సుంకర ప్రసాద్‌లను యూనియన్ తరఫున ఘనంగా సత్కరించారు. యూనియన్ బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోశాధికారి ఎం.వఫాఅబ్బాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పితాని ఈశ్వరరావు, కోశాధికారి పొట్టుపోతు నాగు, నియోజకవర్గ అధ్యక్షుడు అరిగెల రుద్రశ్రీనివాస్, కార్యదర్శి దొమ్మేటి వెంకట్, కాకిలేటి సూరిబాబు, వరదా సూరిబాబు, ఆకుల రవితేజ, చొల్లంగి ప్రసాద్, కడలి సాయిబాబా, ఆసు భరత్‌రామ్, కోరుమిల్లి రాము, ఎస్వీ శర్మ, కానుబోయిన దుర్గాప్రసాద్, ఆకొండి చంద్రమౌళి, నీలకంఠం, కుప్పాల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

వృత్తి నైపుణ్యంతో మెరుగైన ఉపాధి అవకాశాలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు వృత్తి నైపుణ్య శిక్షణ తీసుకోవడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని మంత్రి సుభాష్ అన్నారు. ఆదివారం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు గృహ సంబంధ ఉత్పత్తుల తయారీపై నాలుగు రోజులపాటు వీఎస్ఎం ఇచ్చే ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ముఖ్యమంత్రి ఆశయం మేరకు ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంగా ఏటా 1.75 వేలమందికి మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని సూచించారు. మహిళలు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కలుగచేస్తామన్నారు. స్వయం ఉపాధి కల్పించేందుకు వివిధ రకాలు సబ్బులు, షాంపూలు, లోషన్లు, టూత్‌పేస్టులు తదితర వాటిపై శిక్షణ ఇచ్చేందుకు బెంగళూరు నుంచి నిపుణులు తీసుకొచ్చామని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం తెలిపారు. కార్యక్రమంలో మహిళలకు శిక్షణ ఇచ్చే నిపుణురాలు ప్రియా జైన్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైఖానసస్వామి జయంతి వేడుకలు



ఆలమూరులో వైఖానస జయంతి వేడుకల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలో వైఖానసస్వామి జయంతిని ఘనంగా జరిపారు. మండల వైఖానస సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్థానిక జనార్దనస్వామి ఆలయంలో ఉన్న వైఖానసస్వామి జయంతి సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, విశేష తులసిదళార్చనలు జరిపించారు. వైఖానస జయంతిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఖానస సంఘ అధ్యక్షులు అంగర సత్యనారాయణాచార్యులు, నాయకులు గోపాలాచార్యులు, భగవాన్, సింగుబాబు, గోపి, ప్రభాకరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చింతలూరులో..: చింతలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైఖానసస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాగణంలో ఉన్న వైఖానస విగ్రహానికి పలువురు ప్రత్యేక పూజలు చేశారు. వైఖానసస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు జరిపారు.

ఘనంగా సత్యదేవుడి కల్యాణం



విజయదుర్గా పీఠంలో సత్యదేవుడి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో రెండో రోజు ఆదివారం అన్నవరం వేద పండితులతో రమా సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టోత్తర పూజ, అమ్మవారికి అర్చనలు జరిపారు. స్వామివారి కల్యాణంలో భాగంగా అన్నవరం నుంచి తీసుకు వచ్చిన స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు విష్వక్సేనపూజ, సంకల్పం, రక్షాబంధనం, మాంగల్యాధారణ, తలంబ్రాలు నిర్వహించి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సత్యదేవుడి కల్యాణ విశిష్టతను పీఠాధిపతి గాడ్ భక్తులకు వివరించారు. అన్నవరం దేవస్థానం ఈవో ఈర్ల సుబ్బారావు, చైర్మన్ ఐవీ రోహిత్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు గంగాధరభట్ల శ్రీనివాస్, నిమ్మలగంటి సుధీర్‌శర్మ తదితరులు కల్యాణం నిర్వహించినట్లు అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, వేద పండితులు యనమండ్ర సత్యనారాయణశర్మ, చింతా సాయిరాం శర్మ, సీహెచ్ శర్మ, పాలింగి పట్టాభిరామశర్మ, నాగేశ్వరరావు వాయిద్య బృందం తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

ఆత్రేయపురం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని వేజ్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేషారత్నం పేర్కొన్నారు. ఆదివారం ఆత్రేయపురం వెలుగు కార్యాలయం వద్ద యువతీ, యువకులకు నైపుణ్యంపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా చట్టాలపై అవగాహన కల్పించారు. యువతీ, యువకులు అభివృద్ధి ఏ విధంగా సాధించాలో తెలిపారు. కోఆర్డినేటర్ అంబేడ్కర్, రీజనల్ కోఆర్డినేటర్ సంధ్యారాణి తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.



వెలుగు కార్యాలయం వద్ద శిక్షణ పొందిన యువతీ, యువకులు

పిడుగుపాటును గుర్తించే దామిని యాప్

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం నేపథ్యంలో భారీ వర్షాలు పడుతున్నాయి. ఇలాంటి సమయంలో ఏదో ఒకచోట పిడుగులు పడుతుంటాయి. వాటివల్ల ఆస్తి, ప్రాణనష్టం ఏర్పడుతుంది. ముఖ్యంగా పశువుల కాపర్లు, పంటపొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు పిడుగుపాటుకు ప్రాణాలను కోల్పోయిన ఉదంతాలున్నాయి. మూగజీవాలు సైతం మృత్యువాతపడిన ఘటనలున్నాయి. ఇలాంటి సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా చాలా వరకు ప్రమాదాలను నివారించటంతోపాటు మరణాలను సైతం నియంత్రించవచ్చని పలువురు సూచిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ దామిని యాప్ రూపొందించింది.

యాప్ ఎలా పనిచేస్తుందంటే

పిడుగుపడే సమాచారాన్ని దామిని వజ్రపాత్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ప్లేస్టోర్ నుంచి దామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో తెలుగుతోపాటు పలు భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంటుంది. మొబైల్‌లో ఈ యాప్ ఉన్న వారికి 40 కిలోమీటర్ల పరిధిలో పిడుగులుపడే అవకాశం ఉంటే ముందుగా అలర్ట్ చేస్తుంది. ప్రమాదం ఎప్పుడు జరుగుతుందో గుర్తించి వారికి హెచ్చరికలు జారీ చేస్తుంది.

వర్షంపడే సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి

ఎత్తైన పర్వత ప్రాంతాలు, పొడవైన చెట్లు, సెల్ టవర్లు, విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో పిడుగులుపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఆకాశంలో మెరుపులు, ఉరుములు కనిపించిన వెంటనే ఇళ్లల్లోకి వెళ్లిపోవాలి. చెట్లకింద సమూహంగా ఉండకూడదు. బహిరంగ ప్రదేశాల్లో ఉంటే నిటారుగా నిల్చోవద్దు. నీరున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. విద్యుత్ పరికరాలు వినియోగించవద్దు. వర్షకాలంలో పిడుగులు పడే వేళ వాటిబారిన పడకుండా ప్రజలు కనీస జాగ్రత్తలు పాటిస్తే సురక్షితంగా బయటపడవచ్చని వారు సూచిస్తున్నారు.

అంతర్వేది ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

అంతర్వేది, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన గోపురం ఎదుట ఉట్టి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారి గ్రామోత్సవం, సఖినేటిపల్లివారితో మురళీ కోలాటం అత్యంత వైభవంగా జరిగాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎస్వీ ప్రసాద్ తెలిపారు. భక్తులు, అర్చకులు, వాహనకారులు పాల్గొన్నారు.



ఆలయం ప్రధాన గోపురం ఎదుట ఉట్టి కొడుతున్న దృశ్యం

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

విఘ్నేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

అయినవిల్లి, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విఘ్నేశ్వర ఆలయంలో తోటపేటకు చెందిన నత్తి సుబ్బారెడ్డి, సీతారత్నం దంపతులు ఆదివారం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం ఇత్తడి త్రాసును దేవస్థానానికి వారు బహూకరించారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



కె.గంగవరం మండలం సుందరపల్లిలో జోరు వర్షం



మండపేటలో ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షం



కపిలేశ్వరపురం పుష్కరఘాట్ వద్ద ప్రవహిస్తున్న వరద గోదావరి

జోరువాన..స్తంభించిన జనజీవనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. జోరు వర్షానికి పలు లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజానీకానికి ఆందోళన కలిగిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

కె.గంగవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. మండలంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. పంట పొలాలకు తగిన నీరు చేరుకుంది. పల్లపు పొలాల్లో నీరు గట్లపై నుంచి పొర్లుతోంది. సుందరపల్లిలో ప్రధాన రహదారిపై వర్షం నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

ప్రయాణికులకు తప్పనిపాట్లు

మండపేట, (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షానికి మండపేట నియోజకవర్గంలోని పలు మురుగు కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షం వల్ల జనజీవనం స్తంభించింది. రోజువారీ పనులు చేసుకునే కార్మికులు, కూలీలు వర్షం కారణంగా ఉపాధి కోల్పోయారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షాల కారణంగా వీచే ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు నేలకూలే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం సంబంధిత అధికారులను అప్రమత్తం చేసింది. ఇటీవల వరినాట్లు పూర్తయి రైతులు ఊరట చెందుతున్న నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క ఆయా ప్రాంతాల్లోని రహదారులు ధ్వంసమయ్యాయి. వర్షం కారణంగా ప్రజలు ఇంటికే పరిమితం కావడంతో పలు రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు జ్వరం, దగ్గు, రొంప, ఒళ్లునొప్పులు వంటి పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసింది.



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద రెండు వంతెనల మధ్య గోదావరి వరద ప్రవాహం

పెరుగుతున్న గోదావరి వరద

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గోదావరికి వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరుతో గోదావరి నిండుగా ప్రవహిస్తున్నది. జొన్నాడ పుష్కర్‌ఘాట్ వద్దకు వరదనీరు చేరింది. రెండు వంతెనల మధ్య వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఉధృతి కొనసాగుతోంది. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలకు మండలంలోని లంక గ్రామాల రైతులకు ఆందోళన కలిగిస్తున్నది. మండలంలోని బడుగువానిలంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లోని వేలాది ఎకరాల్లో వాణిజ్య పంటలు సాగవుతున్నాయి. గోదావరికి వరద ఉధృతి ఎక్కువైతే ఆయా లంక భూముల్లోని పంటలకు ప్రమాదం పొంచి ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న వరద ఉధృతి

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా గోదావరి వరద ఉధృతి పెరిగింది. దీంతో నదీ పరివాహక ప్రాంతాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలుచోట్ల లంక పొలాల్లోకి వరదనీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ఇటుక బట్టీలకు నీరు చేరింది. వరద ఉధృతి కారణంగా కపిలేశ్వరపురం, కోరుమిల్లి, తాతపూడి పుష్కరఘాట్లపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్నది. గత ఏడాది వరదల్లో బలహీనంగా ఉన్న పలు ఏటిగట్లకు ఇసుక మూటలు వేసి తాత్కాలిక చర్యలు చేపట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. అప్పట్లో పటిష్ట చర్యలు చేపట్టకపోవడంతో వరద ఉధృతి అధికమైతే ఆయా ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బలహీనంగా ఉన్న ఏటిగట్లకు పూర్తిస్థాయిలో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణీకులు కోరుతున్నారు.



రావులపాలెం మండలంలో నీటమునిగిన వరిపొలాలు

నిర్మానుష్యంగా మారిన రహదారులు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. మండలంలోని పలు రహదారులు నిర్మానుష్యంగా మారాయి. పలుచోట్ల వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల్లో వేసిన వరినాట్లు పలుచోట్ల ముంపునకు గురవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన వరిచేలను చూసుకుని రైతులు ఆవేదన చెందుతున్నారు.

ముంపుబారిన పంట పొలాలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరి పొలాలు ముంపుబారిన పడుతున్నాయి. రావులపాలెం మండలంలోని పలు రహదారులు ఛిద్రమవగా జనజీవనం స్తంభించింది. మండల పరిధిలోని ఆయా శివారు ప్రాంత పంట పొలాలు మళ్లీ ముంపులో చిక్కుకుంటున్నాయి. వర్షం ముంపులో చిక్కుకోవడంతో వరి దుబ్బులపై నాచు పేరుకుపోయి మూనలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షంలోను తగ్గని మహిళా ప్రయాణికుల రద్దీ: ఎడతెరిపి లేకుండా వర్షం పడుతున్నా రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మహిళా ప్రయాణికులతో రద్దీ నెలకొంది. ఉచిత బస్సు రాగానే సీట్ల కోసం మహిళలు ఎగబడటంతో తోపులాటలు జరుగుతున్నాయి.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గొల్లపుంతకాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కాలనీలో సుమారు 2వేలకు పైబడి కుటుంబాలు ఉంటున్నా రేషన్ దుకాణం అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నామని ఆరోపిస్తున్నారు. కాలనీ నుంచి పట్టణంలోకి వెళ్లిరావాలంటే సుమారు 3 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. త్వరితగతిన కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



వాడపల్లిలో ఆబోతుకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆబోతుకు పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తునికి చెందిన భక్తులు ఆబోతును తీసుకువచ్చి వెంకన్నబాబుగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంబోతుకు వెండి ఆభరణాలను అలంకరించారు. వెంకన్నబాబు సంబరం నిర్వహిస్తూ ఆలయ తీరు వీధుల్లో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం తమ గ్రామంలో దాన్ని వదిలిపెట్టి మొక్కుబడి చెల్లిస్తామని వారు తెలిపారు.



అమ్మటీం లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమ్మ టీమ్ లోగో ఆవిష్కరణ

ద్రాక్షారామ,ఆగస్టు17(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో అమ్మ టీం లోగోను ఆదివారం ఆవిష్కరించారు. అమ్మ టీం సభ్యులు కె.గంగవరం కేంద్రంగా పరిసర ప్రాంతాల్లో జరిగిన శుభకార్యాల్లో మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి పేదలకు పంపిణీ చేస్తున్నారు. వారి సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరచడంలో భాగంగా లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు పి.శ్రీరామ్ మణికంఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా సలాది ప్రసన్నకుమార్ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో అమ్మ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



అనంతకుమారిని సత్కరించిన రజక చైతన్య సంస్థ సభ్యులు

కొత్తపేట, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని రాష్ట్ర బీసీ సహకార ఆర్థిక సహాయ సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి అన్నారు. కొత్తపేటలో ఆదివారం ఏపీ రాష్ట్ర రజక చైతన్య సేవా సంస్థ చైర్మన్ కాకినాడ రామారావు, సంఘ సభ్యులు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. అనంతరం రజక సంఘ సభ్యుల సమస్యలు, బీసీ వర్గాల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అనంతకుమారి మాట్లాడుతూ రజకుల అభ్యున్నతికి అవసరమైన చర్యలను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సూదికొండ రాముడు, పాలకొల్లు సత్యనారాయణ, పెరవలి వెంకటేశ్వరరావు, అవిడి సూర్యచంద్రరావు, కేశనకుర్తి వెంకటేశ్వరరావు, నేదునూరి కల్యాణ్, అధికారపు బాబ్జి, ఊనగట్ల నాగపోషికృష్ణ, పుల్లయ్య, కోటి, రాము తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరంలో జరిగిన సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కె.గంగవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు అంతా ఒకచోట చేరి సందడి చేశారు. ఆదివారం వారంతా పాఠశాలకు చేరుకుని అప్పటి స్నేహితులతో ఆనందంగా గడిపారు. అప్పటి తీపి గుర్తులను తలచుకుని ఆటపాటలతో గడిపారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులతో పాటు, పాఠశాలలో ఇప్పుడున్న గురువులను సన్మానించారు. అనంతరం సహచర విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో2 సి.ఆంజనేయులను సన్మానించారు.

శ్రీసర్వారాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

రాయవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు శ్రీసర్వారాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-96 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఆదివారం ఉదయం పాఠశాలకు చేరుకున్న వారంతా తాము చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగి అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యనేర్పిన గురువులను సత్కరించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి అందరికీ ఆహ్వానాలు పంపినట్లు పూర్వ విద్యార్థి నరేష్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో తీపర్తి నరేష్ కుమార్, చుండ్రు ఉమా, దూసర్లపూడి తరుణ్, పిల్లి సుబ్బలక్ష్మి, పాకలపాటి శ్రీనివాస్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



రాయవరం మండలం చెల్లూరు హైస్కూల్‌లో 1988-96 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు

ఘనంగా ముత్యాలమ్మ జలకం

అంబాజీపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): నందంపూడి గ్రామదేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి జలకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థమహోత్సవంలో భాగంగా అమ్మవారి జలకాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మ వారి పూజఘటాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవార్కి చలివిడి, పానకాలను భక్తులు సమర్పించారు. గ్రామస్థులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

బసవేశ్వరస్వామి ఆలయానికి భూమిపూజ

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మండపేటలోని 12వ వార్డులో పునర్నిర్మించే బసవేశ్వరస్వామి ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. దీనికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వేర్వేరుగా హాజరై శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి వెంట స్థానిక పార్టీ నాయకులు, ఆలయ కమిటీ నిర్వాహకులు వున్నారు.

మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యవర్గం ఎన్నిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం నిర్వహించిన జిల్లా ప్రథమ మహాసభలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మొక్కవెళ్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కొమరపు నరేంద్ర కుమార్, కోశాధికారిగా ఎండపల్లి బాబూరావు, ఉపాధ్యక్షులుగా నిమ్మకాయల మహాలక్ష్మీ, ఎన్.నరసింహమూర్తి, సహాయకార్యదర్శిగా టి.గోపి, బంగారు కొండ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, సీఐటీయూ కన్వీనర్ దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

మండపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) మండపేట మండల పరిషత్ సమావేశం 19న మధ్యాహ్నం ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు కూడా హాజరు కావాలని ఆయన కోరారు.

రవాణాశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్‌కు సన్మానం

రాజోలు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రవాణాశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వడ్డి సుందరంను సోంపల్లిలో ఆదివారం దళిత చైతన్యవేదిక రాష్ట్ర నాయకులు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈసందర్భంగా దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ మాట్లాడుతూ నిస్వార్థంగా సమాజానికి సుందరం చేసిన పలు సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జిల్లెల్ల వినోద్, రాష్ట్ర కోఆర్డినేటర్ చింతా శ్రీను, ఉపాధ్యక్షుడు చిలకపాటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, మండపాటి మధు పాల్గొన్నారు.